సాక్షి జగిత్యాల

బుధవారం, 17, మే, 2023



ఎల్లమ్మకు బోనాలు

కథలాపూర్ : భూషణరావుపేట గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు.



వైభవం.. వెంకన్న కల్యాణం

కథలాపూర్ : ఊట్‌పెల్లి, కథలాపూర్ గ్రామాల్లో మంగళవారం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం

44.5/37.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. వడగాడ్పులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పంచాయతీ పాలనపై దృష్టి



పుష్పగుచ్ఛం అందిస్తున్న డీపీవో దేవరాజ్

జగిత్యాలరూరల్: పంచాయతీ పాలనపై దృష్టి పెట్టాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సూచించారు. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన దేవరాజ్ జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలుతోపాటు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు.

'సమస్యలను గాలికొదిలేస్తున్నారు..'



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాల: కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం కొమ్ముకాస్తోందని, విద్యారంగంలోని సమస్యలను గాలికొదిలేస్తోందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు జగదీశ్ విమర్శించారు. మంగళవారం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడి 9 ఏళ్లు గడుస్తున్నా విద్యారంగ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పేద, మధ్య తరగతి పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదని విమర్శించారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు అరికట్టాలని డిమాండ్ చేశారు. కొన్ని విద్యాసంస్థలను వ్యాపార కేంద్రాలుగా మార్చి పుస్తకాలు, యూనిఫాంలు, స్టేషనరీ విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు రాజేశ్, నవీన్, ఉమేశ్, అనిల్, గంగాధర్, రంజిత్‌రెడ్డి, విజయ్, నరేశ్, రమేశ్, రవితేజ, అజయ్ పాల్గొన్నారు.

కోరుట్ల బంద్ సంపూర్ణం



మూసి ఉన్న దుకాణాలు

కోరుట్ల: జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌పై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలనే డిమాండ్‌తో విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బంద్ సంపూర్ణమైంది. వర్తక, వాణిజ్య దుకాణాలు, హోటళ్లు, పెట్రోల్ బంకులు స్వచ్ఛందంగా మూసివేశారు. నాయకులు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గజం రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి చెట్‌పల్లి శంకర్, ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యదర్శి గట్ల శివ, బజరంగదళ్ కార్యకర్తలు కల్లెడ రోహిత్, పల్లికొండ వెంకటేశ్, చంద్రశేఖర్, ప్రశాంత్, శివ, జయప్రకాశ్, యాదవ సంఘం నాయకులు జాల ఆనంద్, గడేల విజయ్, దండికే కిశోర్, జాల హరీశ్, హిందూ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఆదాయం రూ.1.30కోట్లు



కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం

మల్యాల(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి పెద్ద జయంతి సందర్భంగా సుమారు రూ.1,30,43,525 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటేశ్ మంగళవారం తెలిపారు. ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించామన్నారు. ఈసందర్భంగా దీక్ష విరమణ ద్వారా రూ.27,46,100, కేశ ఖండన ద్వారా రూ.8,73,150, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.15,68,500, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.63,69,720, పులిహోర ప్రసాదం ద్వారా రూ.12,14,255, ఆర్జిత సేవల ద్వారా రూ.2,71,800 ఆదాయం సమకూరినట్లు ఆయన వివరించారు.

పైసల్ పడ్తలేవు!

- వారం కిందనే ధాన్యం విక్రయించిన రైతులు
- ఇంతవరకు ఖాతాల్లో జమకాని యాసంగి డబ్బులు
- డబ్బుల కోసం అన్నదాతల ఎదురుచూపులు
- కొనుగోళ్లు చివరిదశకు వచ్చినా..మారని పరిస్థితి



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఆరుగాలం కష్టపడి కష్టనష్టాలకు ఓర్చి, వడగండ్లు, కడగండ్లను దాటుకుని కొనుగోలుకేంద్రాలకు చేర్చిన ధాన్యం అకాల వర్షానికి కొట్టుకుపోగా మిగిలిన పంటను రైతులు అమ్ముకున్నారు. విక్రయించి వారం దాటినా.. ఇంతవరకూ నయాపైసా జమకాకపోవడంపై అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. వేసవికాలం పంట కొనుగోళ్లు చివరిదశకు వచ్చినా.. ఇంకా డబ్బులు రైతుల ఖాతాలో పడకపోయేసరికి రైతు కుటుంబాలు దిగులు చెందుతున్నాయి.

తగ్గిన దిగుబడి

ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా రైతులంతా వరిసాగుకే మొగ్గుచూపుతారు. ఈసారి మార్చిలోనే ఈదురుగాలులు వడగండ్లతో వాణిజ్యపంటలు నేలమట్టమయ్యాయి. చాలాచోట్ల వరిపంట కూడా దెబ్బతింది. కానీ, ప్రకృతి కోపానికి ఎదురొడ్డి నిలిచి, వాతావరణ ప్రతికూలతలు తట్టుకుని నిలబడినా వరికోత సమయానికి అకాలవర్షాలు, వడగండ్లు వరుసగా దాడి చేశాయి. పంట దిగుబడి చాలా తగ్గింది. కరీంనగర్‌లో 2.71 లక్షలు, పెద్దపల్లిలో 2.00 లక్షలు, జగిత్యాలలో 2.97 లక్షలు, సిరిసిల్లలో 1.71 లక్షల ఎకరాల చొప్పున పంట వేశారు. ఇందులో కరీంనగర్‌లో దాదాపు 56,066, సుమారు జగిత్యాలలో 65,794, సిరిసిల్లలో సుమారు 18,230 ఎకరాలు, పెద్దపల్లిలో దాదాపు 36,596 ఎకరాల మేర పంట నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు సర్వే ద్వారా నిర్ధారించారు. ఈ గణాంకాల్లో స్వల్ప వ్యత్యాసాలు కూడా ఉండొచ్చు.

వారంరోజులు దాటినా.. అందని డబ్బులు..

ఈ నేపథ్యంలో ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచింది. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ప్రకటించింది. వెంటనే కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభించింది. ఎంతో కష్టపడి చివరికి అన్నదాతలు తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించారు. అక్కడా మళ్లీ గాలులు, వడగండ్లతో ప్రకృతి పగబట్టిందా? అన్న స్థాయిలో వరుణదేవుడు విరుచుకుపడ్డాడు. వర్షపునీటికి కొట్టుకుపోగా మిగిలిన ధాన్యాన్ని ఎట్టకేలకు విక్రయించారు. విక్రయించే సమయంలోనూ తాలు, గడ్డి, మట్టిబెడ్డలు, తేమ శాతం పేరు చెప్పి క్వింటాలుకు 9 నుంచి 11 కిలోల వరకు తరుగు పేరిట రైతులను కొనుగోలు కేంద్రాలు, మిల్లర్లు కుమ్మక్కై దోపిడీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ధాన్యాన్ని విక్రయించిన చాలా మంది రైతులు వారం గడిచినా డబ్బులు ఖాతాలో జమ కాకపోవడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టామని వీలైనంత త్వరగా ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

తేదీ 15-05-2023 వరకు ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	సేకరించిన ధాన్యం	మిల్లులకు తరలించింది	మిగిలింది
కరీంనగర్	1,36,064.496	1,34,948.957	1,115.539
జగిత్యాల	1,59,627.092	1,39,929.690	19,697.402
పెద్దపల్లి	1,00,763.720	97,667.340	3,096.380
రాజన్నసిరిసిల్ల	92,948.940	85,073.420	7,875.520
మొత్తం	4,89,404.248	4,57,619.407	31,784.841

డబ్బులు పడలేదు..



నేను ఈ నెల 4వ తేదీన ధాన్యం కాంట వేశారు. 9వ తేదీన రిసిప్ట్ కూడా ఇచ్చారు. ఇప్పటి వరకు నా ఖాతాలో డబ్బులు జమ కాలేదు. సెంటర్ నిర్వాహకులు రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వెంటనే డబ్బులు జమ చేయాలి. – పాకాల అనిల్‌రెడ్డి, జగ్గయ్యపల్లి, మానకొండూరు

వారం రోజులు అవుతోంది



ఈ సీజన్‌లో 90 క్వింటాళ్ల వరి ధాన్యం పండింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించి వారం రోజులు అయ్యింది. లారీలో ధాన్యం తరలించారు. ఇప్పటికి నాకు డబ్బులు రాలేదు.– ఆకుల పెద్ద గంగారెడ్డి, కథలాపూర్

పది రోజులైంది



నాలుగు ఎకరాలలో ఈ యాసంగిలో వరి పంట వేసిన. నాలుగు ఎకరాలలో 230బస్తాల (40కిలోల సంచి)దిగుబడి వచ్చింది. పది రోజుల క్రితం ధాన్యంను కొనుగోలు కేంద్రంలో అమ్ముకున్న. క్వింటాలకు 4.60 కిలోల తరుగు పేరుతో కటింగ్ పెట్టారు. ఇన్నిరోజులవుతున్నా పైసలు పడలేదు.

– మారం తిరుపతిరెడ్డి, రైతు, హిమ్మత్‌నగర్, వీణవంక

నిర్లక్ష్యంతోనే ఆలస్యం



గతంలో పది రోజులో డబ్బులు జమ అయ్యేవి.. కొనుగోలు చేసిన వెంటనే ఆన్‌లైన్ చేస్తే ఈ సమస్య ఉత్పన్నమయ్యేది కాదు. నిర్వాహకులు ఎప్పటికప్పుడు రైతుల జాబితాను, వారి వడ్లు ఎంత మొత్తంలో అమ్మకం చేశారో ఆన్‌లైన్ చేస్తే వెంటనే బ్యాంకు ఖాతాలో అధికారులు జమ చేసేవారు. నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల ఆలస్యమవుతుంది.

– గెల్లు చిరంజీవి, యాదవ్‌నగర్, సుల్తానాబాద్

భానుడి భగభగలు



ఇబ్రహీంపట్నం : ఉదయం 11 గంటలకు నిర్మానుష్యంగా మారిన మెయిన్ రోడ్డు

జగిత్యాలఅగ్రికల్చర్: భానుడి భగభగలతో జిల్లా వాసులు వణికిపోతున్నారు. మూడు రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. వడగాలుల తీవ్రత కూడా అధికంగా ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 44.5 డిగ్రీల సెల్సియస్‌గా, కనిష్ట ఉష్ణోగ్రతలు 35 నుంచి 37డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎండవేడి తగ్గడంలేదు.

గరిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల సెల్సియస్‌లో)

మండలం	ప్రాంతం	ఉష్ణోగ్రతలు
ధర్మపురి	బుద్దేశ్‌పల్లి	44.5
మల్లాపూర్	రాఘవపేట	44.5
ఇబ్రహీంపట్నం	గోధూరు	43.2
ధర్మపురి	జైనా	43.0
సారంగాపూర్	సారంగాపూర్	43.0
వెల్గటూర్	వెల్గటూర్	42.9
ధర్మపురి	నేరెళ్ల	42.9
బీర్‌పూర్	కొల్వాయి	42.9
మెట్‌పల్లి	మెట్‌పల్లి	42.7
మల్లాపూర్	మల్లాపూర్	42.7
ఎండపల్లి	ఎండపల్లి	42.5
వెల్గటూర్	గుల్లకోట	42.5
మల్యాల	మద్దుట్ల	42.3
జగిత్యాలరూరల్	పొలాస	42.2
బుగ్గారం	సిరికొండ	42.0



ప్రజల భాగస్వామ్యంతో వ్యాధుల నియంత్రణ

- కీటకజనీత వ్యాధుల నియంత్రణ అధికారి శ్రీనివాస్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జగిత్యాల: వ్యాధుల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యమని కీటకజనీత వ్యాధుల నియంత్రణ అధికారి శ్రీనివాస్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడారు. డెంగీ, ఇతర కీటకాల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి నివారణ, నియంత్రణ చర్యలు, వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలపై వివరిస్తున్నామన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ఆరోగ్య విద్యాబోధన చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ, డెంగీ ప్రబలితే కీళ్ల లేదా కండరాల్లో నొప్పి, వికారం, గ్రంథుల వాపు, దద్దుర్లు, ఇతర లక్షణాలు సర్వసాధారణంగా కనిపిస్తాయన్నారు. కొన్ని సందర్భాల్లో తప్ప చాలామంది ఏడు రోజుల్లో కోలుకుంటారని చెప్పారు. లక్షణాలు ముదిరితే ప్రాణాపాయం ఉంటుందని హెచ్చరించారు. ఆ లోగా డాక్టర్‌ను సంప్రదించి కచ్చితంగా వైద్య చికిత్సలు తీసుకోవాలని సూచించారు. ఇది ఒకరికంటే ఎక్కువ మందికి సోకే అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, డీపీవో స్వామి, వైద్యాధికారులు స్వాతి, లక్ష్మణ్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో రక్తహీనతకు చెక్

- గర్భిణులకు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు
- రెండు విడతలుగా అందజేత
- తొలివిడతలో వెయ్యి కిట్లు సిద్ధం
- పంపిణీకి సన్నాహాలు చేస్తున్న అధికారులు
- జిల్లాలో 7వేల మంది గర్భిణులకు ప్రయోజనం



పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీలు(ఫైల్)



జిల్లాకు కేటాయించిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు

ధర్మపురి: గర్భిణుల్లో రక్తహీనతకు చెక్ పెట్టడడంతోపాటు మాతా, శిశు మరణాలను నియంత్రించే లక్ష్యంతో ప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసేందుకు నిర్ణయించింది. జిల్లాలోని సుమారు 7,702మంది గర్భిణులకు రెండు విడతల్లో వీటిని అందజేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడం..

- మాతా, శిశు మరణాల సంఖ్య తగ్గించడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీల సంఖ్య పెంచడం లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు అందజేయాలని నిర్ణయించింది.
- గతేడాది డిసెంబర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంపికచేసిన జిల్లాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించారు.
- ఆయా జిల్లాల్లో వీటిద్వారా సత్ఫలితాలు రావడంతో రాష్ట్రవ్యాప్తంగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు అందించడానికి ఏర్పాట్లు వేగవంతం చేస్తున్నారు.
- మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బాలింతలకు కేసీఆర్ కిట్టు, నగదు అందజేస్తోంది.
- మహిళల ఆరోగ్యాన్ని మరింత మెరుగు పర్చడం కోసం గర్భిణులకు తాజాగా కిట్లు అందజేయాలని నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాకు 4 వేలకు పైగా కిట్లు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంగనర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లోని గర్భిణులకు సుమారు 4 వేలకుపైగా న్యూట్రిషన్ కిట్లు మంజూరయ్యాయి. అందులో భాగంగానే జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుమారు వెయ్యి కిట్లను పంపిణీ చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈనెలాఖరులోగా ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో న్యూట్రిషన్ కిట్లు అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు.

కిట్ల పంపిణీ ఇలా..

తొలివిడత :
గర్భం దాల్చిన 13 నుంచి 24వారాల మధ్య

రెండోవిడత :
గర్భం దాల్చిన 28 నుంచి 34 వారాల మధ్య న్యూట్రిషన్ కిట్లు అందిస్తారు.

రెండు విడుతల్లో పంపిణీ..

- జగిత్యాల జిల్లాలో 1,065 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.
- అందులో ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు 1,037 ఉన్నాయి. మిగతావి మినీ అంగన్‌వాడీ కేంద్రాలు.
- వీటి పరిధిలో 7,702 మంది గర్భిణులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.
- వీరందరికీ రెండు విడుతల్లో న్యూట్రిషన్ కిట్లు అందజేస్తారు.
- కొన్ని ప్రాంతాల్లోని మహిళలు గర్భం దాల్చిన తర్వాత కూడా సరైన పౌష్టికాహారం తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు.
- తద్వారా మాతా, శిశు మరణాలు సంభవిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు.
- వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని గర్భవతుల్లో రక్తహీనత నియంత్రణకు ప్రభుత్వం పౌష్టికాహార కిట్లును పంపిణీ చేస్తోంది.

కిట్‌లో ఐదు రకాల పోషక పదార్థాలు

గర్భిణులు రక్తహీణతను అధికమించడానికి ఒక కిలో పోషకాహార పదార్థం(మదర్ హార్లిక్స్), కిలో ఖర్జూర పండ్లు, అరకిలో నెయ్యి(500 గ్రాములు), ఐరన్ సిరప్, ఆల్బెండాజోల్ మాత్రలు ఉంటాయి. మొదటి కిట్టు బుట్ట రూపంలో, రెండో కిట్టు సంచిరూపంలో అందజేస్తారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యం



గర్భవతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార కిట్లు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తాయి. ప్రధానంగా రక్తహీనతను అధికమించడానికి కిట్లు ఎంతో దోహదం చేస్తుంది. జిల్లాకు తొలివిడతలో సుమారు వెయ్యి కిట్లు మంజూరయ్యాయి. వారం, పది రోజుల్లో వాటిని పంపిణీ చేస్తాం. ఇందుకోసం ప్రణాళిక రూపొందించాం.

– జైపాల్‌రెడ్డి, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, హాజరైన కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- సీఎం కేసీఆర్ రైతుపక్షపాతి
- మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు చేస్తామని, సీఎం కేసీఆర్ రైతుపక్షపాతి అని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు ప్రగతిపై స్థానిక సమీకృత కలెక్టరేట్ భవనంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు, అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. జిల్లాలో 4.56 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక తయారుచేశామని పేర్కొన్నారు. ప్రతీ మండలానికి జిల్లా అధికారిని ప్రత్యేకంగా నియమించి క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు పరిశీలిస్తామని అన్నారు. రైస్‌మిల్లుల వద్ద 24 గంటల వ్యవధిలో ధాన్యం దిగుమతి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిల్లుల వద్ద తూకంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అకాల వర్షాలతో తలెత్తిన సమస్యలపై సీఎం కేసీఆర్ వెంటనే స్పందించారని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకి రూ.10 వేల పరిహారం తొలివిడతలో మంజూరు చేశారని తెలిపారు. రైతుసంక్షేమం కోసం ఏటా రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తూ 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. 2014తో పోలిస్తే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,59,626 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. కాంగ్రెస్ పాలనలో ఎరువులు, విత్తనాలు సరిగా పంపిణీ చేయక రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని గుర్తుచేశారు. దేశంలో రైతులు పండిస్తున్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సంజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, కలెక్టర్ యాస్మిన్ బాషా పాల్గొన్నారు.

కముజు పిట్టల పెంపకంతో అదనపు ఆదాయం

కోరుట్లరూరల్: కముజు పిట్టల పెంపకంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వ విద్యాలయ అసోసియేట్ డీన్ మాధవరావు అన్నారు. పశువైద్య విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధన మండలి, న్యూఢిల్లీ ఆధ్వర్యంలో మంగళవారం పైడిమడుగు, ధర్మారం రైతులకు కముజు పిట్టల పెంపకం, పోషణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వీటి ద్వారా అదనపు ఆదాయమే కాకుండా స్వయం ఉపాధికి చక్కని మార్గమని అన్నారు. ప్రొఫెసర్లు రాంబాబు, దైవకృష్ణ, సకారం, శ్రీదేవి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన..

కోరుట్ల : స్థానిక పశువైద్య కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. పశువైద్య విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ మాధవరావు మాట్లాడుతూ సీపీఆర్ ప్రధాన ప్రక్రియ అని, వైద్యం అందుబాటులో లేనపుడు సీపీఆర్ ద్వారా మనిషి ప్రాణం నిలిచే అవకాశం ఉందని తెలిపారు. మెట్‌పల్లి వైద్యాధికారి రంజిత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కృష్ణచైత, సురేశ్ పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపాలి

జగిత్యాల: ఓటరు జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలపాలని ఆర్డీవో మాధురి సూచించారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు జాబితా ధ్రువీకరణపై జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో సమీక్షించారు. పొరపాట్లు లేని ఓటరు జాబితాకు అందరూ సహకరించాలని ఆమె కోరారు.



మాట్లాడుతున్న ఆర్డీవో మాధురి

క్లుప్తంగా

రేషన్ బియ్యంలో తలంబ్రాలు



అల్లీపూర్‌లో బియ్యంలో వచ్చిన తలంబ్రాలు

రాయికల్(జగిత్యాల): మండలంలోని అల్లీపూర్ గ్రామంలో ప్రభుత్వం సరఫరా చేసిన రేషన్ బియ్యంలో తలంబ్రాలు వస్తుండటంతో డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఖయ్యూం బియ్యాన్ని పరిశీలించి, సివిల్ సప్లై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జగిత్యాల నుంచి సరఫరా అవుతున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతుందనానికి ఇదే నిదర్శనమని పలువురు అంటున్నారు.

అణగారిన వర్గాలకు రాజ్యాధికారం ఇవ్వాలి



మాట్లాడుతున్న నరేశ్

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): అణగారిన వర్గాలకు రాజ్యాధికారం ఇవ్వాలని బహుజన దళం జిల్లా అధ్యక్షుడు లింగంపెల్లి నరేశ్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతోపాటు అమ్మక్కపేట, కొజన్‌కొత్తూర్, వేములకుర్తి, యామాపూర్ గ్రామాల్లో మంగళవారం సబ్బండ ప్రజల చైతన్యయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటును అమ్ముకోవద్దని ప్రజలను కోరారు. రాజ్యాధికారమే లక్ష్యంగా హక్కుల సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం కళాకారుల ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గౌడ గీత కార్మికుల సేవా సమితి అధ్యక్షుడు పొన్నం తిరుపతిగౌడ్, నాయకులు బుర్రి ముత్యం, తరి రామానుజం, గ్రామస్తులు పాల్గొన్నారు.

21న ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షలకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు 99592 64770 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బెస్ట్ అవేలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలు

జగిత్యాల: జిల్లాలో 2023–24 సంవత్సరానికిగాను బెస్ట్ అవేలబుల్ స్కూల్స్‌లో గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు 20 సీట్లు కేటాయించినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో లంబాడా బాలికలకు రెండు, బాలురకు 4, ఎరుకల బాలురకు 1, బాలికలకు 1, గోండు బాలురకు 1, ఎస్టీ కులాలకు 1, ఐదో తరగతిలో లంబాడా బాలురకు 2, బాలికలకు 1, ఎరుకల బాలికలకు 1, గోండు బాలురకు 1, 8వ తరగతిలో లంబాడా బాలురకు 1, బాలికలకు 1, గోండు బాలురకు 1, బాలికలకు 1, ఇతర ఎస్టీ కులాల బాలురకు 1 చొప్పున సీట్లు ఉన్నాయన్నారు. అభ్యర్థులు జగిత్యాల జిల్లాకు చెందిన వారై ఉండాలని, పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాలతో జూన్ 2లోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కరీంనగర్ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. జూన్ 7న విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని, ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. మిగతా వివరాలకు 96521 18867 ఫోన నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యలక్ష్మి పథకం.. సన్న బియ్యంతో భోజనం

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెలాఖరు నుంచి అమలుకు చర్యలు
- గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మేలు
- జిల్లాలో లబ్ధిదారులు 61,183 మంది



పెగడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహార, ఆరోగ్య రక్షణ కేంద్రాలుగా అంగన్‌వాడీ సెంటర్లు పని చేస్తున్నాయి. వీటిని వారికి మరింత చేరువ చేస్తూ ఈ నెలాఖరు నుంచి సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల ఆయా కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులు సంఖ్య పెరుగుతుంది. అంతేకాదు ఆరోగ్య లక్ష్మి పథకం లక్ష్యం నెరవేరుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలు, పూర్వ ప్రాథమిక విద్యతోపాటు గుడ్లు, పాలు, బాలామృతం, మధ్యాహ్న భోజనం, చిరుతిళ్లు అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా భోజనం మాత్రం దొడ్డు బియ్యంతో వడ్డిస్తుండటంతో గర్భిణులు, బాలింతలు, పిల్లల్లో 40 శాతం మంది లబ్ధిదారులు తినేందుకు ఆసక్తి చూపడం లేదు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం ఈ నెలాఖరు నుంచి సన్నబియ్యంతో భోజనం పెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖదే ఖర్చు..

ఇటీవల నూతన సచివాలయం ప్రారంభించిన సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్న బియ్యంతో భోజనం ప్రతిపాదనలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందుకు అదనంగా అయ్యే ఖర్చును స్త్రీ, శిశు సంక్షేమ శాఖ భరించనుంది. దీంతో పౌరసరఫరాల శాఖ ద్వారా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు నేరుగా సన్నబియ్యం చేరవేయనున్నారు. ప్రస్తుతం కేంద్రాల్లో ఒక్కో లబ్ధిదారుకు రూ.22.50 ఖర్చు చేసి, ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నారు. తాజాగా సన్నబియ్యంతో భోజనం అందించనుండటంతో వేలాది మంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు మేలు జరగనుంది. ఫలితంగా పోషక లోపాల్ని, రక్తహీనత సమస్యల్ని అధిగమించే వీలుంటుంది. పిల్లల్లో వయసుకు తగ్గ బరువు, ఎత్తు సాధించే అవకాశం ఉంటుంది.

జిల్లా సమాచారం

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	: 4 (మెట్‌పల్లి, మల్యాల, పెగడపల్లి, జగిత్యాల)
అంగన్‌వాడీ కేంద్రాలు	: 1,065
7 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు	: 35,188
3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు	: 17,255
గర్భిణులు	: 7,702
బాలింతలు	: 1,038

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం



మా చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపిస్తున్నా. అక్కడ పూర్వ ప్రాథమిక విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నారు. కానీ దొడ్డు బియ్యంతో వండిన అన్నం తినేందుకు పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో సన్న బియ్యంతో భోజనం అందిస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం. – జొన్నల మానస, పేరెంట్

నేరుగా కేంద్రాలకు సరఫరా..



ఆరోగ్యలక్ష్మి పథకం కింద సన్న బియ్యంతో భోజనం వడ్డించేందుకు మార్గదర్శకాలు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తాం. గోదాంల నుంచి సన్న బియ్యం నేరుగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతాయి. పిల్లలు, బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి. – నరేశ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి

కారును ఢీకొన్న మరో కారు



సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని గణేశ్‌పల్లి గ్రామ శివారులో ఓ కారు మరో కారును ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై మనోహర్‌రావు కథనం ప్రకారం.. జగిత్యాలకు చెందిన ఎండీ.ఫరీద్ అనే డ్రైవర్ కారులో వైద్య సిబ్బందిని జగిత్యాల నుంచి తీసుకెళ్లి, బీర్‌పూర్ మండలంలో కంటి వెలుగు శిబిరం వద్ద దింపి, తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన జాలపల్లి ప్రశాంత్ కారులో జగిత్యాల నుంచి ఆదిలాబాద్ వెళ్తున్నాడు. గణేశ్‌పల్లి శివారులో ప్రశాంత్ అజాగ్రత్తగా, అతివేగంగా వెళ్లి, ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రెండు వాహనాల్లోని బెలూన్లు ఓపెన్ కావడంతో ఎవరికీ ప్రాణహాని జరగలేదు. ప్రశాంత్ కారులో ఉన్న సత్యనారాయణ, శ్రావణిలకు గాయాలయ్యాయి. మరో చిన్నారికి ఎలాంటి గాయాలు కాలేదు. కాగా రెండు కార్లు తీవ్రంగా దెబ్బతిన్నట్లు ఎస్సై తెలిపారు. ఫరీద్ ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సారంగాపూర్(జగిత్యాల): మండలంలోని లచ్చనాయక్‌తండా గ్రామానికి చెందిన భూక్య గణేశ్ (47) చికిత్స పొందుతూ మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9న గణేశ్ గ్రామ శివారులోని మామిడి తోటలో మామిడి కాయలు తెంపుతున్నాడు. ఈ క్రమంలో కొమ్మ విరిగి, కింద పడటంతో అతని మెడ విరిగింది. కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

‘కోత’ పెడుతున్న మిల్లర్లపై చర్యలేవి?

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్, నాయకులు

వెల్గటూర్(ధర్మపురి): నాణ్యత ఉన్న ధాన్యాన్ని సైతం మిల్లర్లు బస్తాకు 3 కిలోల చొప్పున తరుగు పేరిట కోత విధిస్తున్నా మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎందుకు స్పందించడం లేదని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రశ్నించారు. ఎండపల్లి మండలంలోని మారేడుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ ఏడాది పంట దిగుబడి కంటే ఖర్చులే ఎక్కువ అయ్యాయని తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే కనీస సౌకర్యాలు లేవని, తరుగు పేరిట దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా అధికారులు మిల్లర్లపై చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ఎటువంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాలసాని మల్లేశ్‌గౌడ్, సురేశ్, రవికుమార్, మహేశ్, అజయ్, అన్నదాతలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై నిఘా ఉంచండి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, అధికారులు

జగిత్యాల: నకిలీ విత్తనాల విక్రయాలపై నిఘా ఉంచాలని, ఉక్కుపాదం మోపి అరికట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వ్యవసాయ శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించి, రైతులకు ఉపాధి కల్పిస్తున్నారని తెలిపారు. గడిచిన తొమ్మిదేళ్లలో వ్యవసాయ రంగానికి రూ.4.5 లక్షల కోట్లు కేటాయించారన్నారు. రైతులకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని, వారికి నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి అవసరం మేరకు విత్తనాలు, ఎరువులు నిల్వ ఉంచుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన వైఖరి వల్ల నకిలీ విత్తనాలు దాదాపుగా లేవని చెప్పారు. దేశానికి అవసరమైన విత్తనాల్లో దాదాపు 60 శాతం తెలంగాణ నుంచి సరఫరా చేస్తున్నామని తెలిపారు. నకిలీ విత్తనాలు ఇతర రాష్ట్రాల నుంచి రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి, నిఘా పెంచాలని సూచించారు. కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంగంపల్లి, భవానీనగర్‌లలో చోరీ

- నగదు, బంగారు ఆభరణాలు, ఫోన్లు అపహరణ

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలంలోని సంగంపల్లికి చెందిన పబ్బ రాజు జగిత్యాల భవానీ నగర్‌లో బిస్కట్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. సోమవారం సాయంత్రం షాపునకు తాళాలు వేసి, ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా కౌంటర్‌లో ఉన్న రూ.10 వేలు, తులం బంగారు చైన్, 8 గ్రాముల బంగారం కనిపించలేదు. చోరీ జరిగిందని గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రామచందర్‌రావు తెలిపారు. అలాగే భవానీ నగర్‌కు చెందిన బిక్కునూరి శ్రీధర్ సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి, కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో వివాహానికి వెళ్లారు. రాత్రి ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో పక్కింటివారు శ్రీధర్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. అతను మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి బీరువాలో ఉన్న రెండు బంగారు చెవికమ్మలు, రెండు లాకెట్లు, కిలో వెండి, మూడు సామ్‌సంగ్ ఫోన్లు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

నేటినుంచి ప్రత్యేక పారిశుధ్య పనులు

జగిత్యాల: జిల్లాలో బుధవారం నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ చేపడతామని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. బుధవారం గ్రామాల్లోని అన్ని వీధుల్లో చెత్తాచెదారం తొలగించాలని, గురువారం మురుగు కాలువలు శుభ్రం చేయాలని, శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఇంటి ఆవరణలో పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని, శనివారం దోమల లార్వాలు నాశనం చేసేలా స్ప్రే చేయాలని, ఆదివారం ఇంటింటా ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టేలా అవగాహన కల్పించాలని, సోమవారం నిరుపయోగ బావులు, బోర్‌బావులు పూడ్చివేయాలని, మంగళవారం స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా గ్రామంలోని ముఖ్య కూడళ్లలో ప్రజల అవగాహన కోసం వాల్ పెయింటింగ్స్ వేయాలని ఆదేశించారు.

రుద్రంగిలో ఆర్టీసీ బస్సు, వ్యాన్ ఢీ

- రెండు వాహనాలూ ధ్వంసం
- మండల కేంద్రంలో ఇరుకు రోడ్డుతో ప్రయాణికుల ఇబ్బందులు



ఢీకొన్న ఆర్టీసీ బస్సు, వ్యాన్

రుద్రంగి(వేములవాడ): మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఇందిరా చౌక్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండటంతోపాటు ధ్వంసమైంది. దీంతో ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆర్టీసీ బస్సు, లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ ఒకదానికొకటి ఢీకొని, ధ్వంసమయ్యాయి. ఈ రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, బాగు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- డివైడర్‌ను ఢీకొన్న వాహనం
- డ్రైవర్ మృతి, పలువురికి స్వల్ప గాయాలు
- బాధితులు హైదరాబాద్‌వాసులు



సిరిసిల్ల అర్బన్: ఓ వాహనం అదుపుతప్పి, డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతిచెందగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన పైండ్ల రాజు(48) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతను హైదరాబాద్‌కే చెందిన ఓ కుటుంబాన్ని సోమవారం తుఫాన్ వాహనంలో వేములవాడ, కొండగట్టు, ధర్మపురి క్షేత్రాలకు తీసుకెళ్లాడు. స్వామివార్ల దర్శనం అనంతరం మంగళవారం తిరుగుపయనమయ్యారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని బొమ్మల మూలమలుపు వద్ద వాహనం అదుపు తప్పి, డివైడర్‌ని ఢీకొట్టి, చాలా దూరం దాన్ని తాకుతూ వెళ్లింది. ఈ ఘటనలో డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. స్థానికులు 108కి సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చి, సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించేలోపే రాజు మృతి చెందినట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు. వాహనంలో ఉన్న మొత్తం 10 మందిలో పలువురికి స్వల్ప గా యాలయ్యాయని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తల్లిని చంపిన తనయుడికి జీవితఖైదు

సిరిసిల్లటౌన్: తల్లిని చంపిన ఓ తనయుడికి జీవితఖైదు విధిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా జడ్జి ప్రేమలత తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఇల్లంతకుంట మండలంలోని అంతగిరి గ్రామానికి చెందిన యర ఎల్లవ్వ పేరిట బ్యాంకులో రూ.44 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. నామినిగా కుమారుడు యర రాజయ్యగా పేర్కొంటూ.. బ్యాంకులో నగదు దాచుకుంది. తల్లిని చంపితే మొత్తం డబ్బులు వెంటనే తనకు వస్తాయన్న దురాశతో అతను పథకం వేశాడు. 24 జూన్ 2021న రాత్రి తల్లిపై కర్రతో దాడి చేసి, హతమార్చాడు. మృతురాలి మరో కుమారుడు ముత్తయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సిరిసిల్ల రూరల్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో 10 మంది సాక్షులకు కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూటర్ పవన్‌కుమార్ వాదనలు వినిపించి, రాజయ్య నేరం చేసినట్లు రుజువు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన జడ్జి అతనికి జీవితఖైదుతోపాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెల్లడించారు. నేరస్తుడికి శిక్ష పడేందుకు కృషి చేసిన సీఐ ఉపేందర్, కోర్టు కానిస్టేబుళ్లు మహేందర్, నవీన్, సీఎంఎస్ ఎస్సై శ్రీనివాస్, కానిస్టేబుల్ నరేందర్‌లను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

- స్కూటీని వ్యాన్ ఢీకొట్టడంతో ఘటన
- బాధితుడి పరిస్థితి విషమం



గాయపడిన లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన మీసం లక్ష్మణ్ మంగళవారం స్కూటీపై రాగట్లపల్లి వైపు వెళ్తున్నాడు. అదే సమయంలో సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వేగంగా వస్తున్న డీసీఎం వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ దూరంగా ఎగిరి పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు 108 వాహనంలో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. లక్ష్మణ్‌ను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి పరామర్శించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

పవర్‌లూం కార్మికుని బలవన్మరణం

- ఐదుసార్లు పవర్‌లూమ్స్ అద్దెకు తీసుకొని నడిపినా నష్టాలే
- మనస్తాపంతో ఆత్మహత్య



ఆంజనేయులు (ఫైల్)

సిరిసిల్లక్రైం: కులవృత్తిని నమ్ముకున్నాడు.. వరుస నష్టాలు వస్తున్నా అదే పనిలో రాణించాలని తపన పడ్డాడు.. ఏం చేసినా నష్టాలే రావడంతో చివరికి తనువు చాలించాడు పవర్‌లూం కార్మికుడు ఎనుగంటి ఆంజనేయులు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన ఆంజనేయులు(43) ఐదుసార్లు పవర్‌లూమ్స్‌ను అద్దెకు తీసుకొని, పని చేయగా నష్టం వచ్చింది. ఇటీవల ప్రభుత్వం ఇస్తున్న వస్త్రోత్పత్తి ఆర్డర్లతో కాస్త లాభాలు వస్తాయని ఆశించి, కొన్ని నెలల క్రితం ఐదు జోడిలను అద్దెకు తీసుకొని, నడిపిస్తున్నాడు. వీటితోనూ నష్టమే రావడంతో మనస్తాపం చెందాడు. మంగళవారం పవర్‌లూంకు సంబంధించిన సామగ్రి షెడ్డులో తాడుతో ఉరేసుకున్నాడు. మృతుని భార్య శ్రీలత అపెరల్ పార్కులో పని చేస్తోంది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు ఆంజనేయులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు.

డీజే యజమానుల బైండోవర్

కోనరావుపేట(వేములవాడ): గ్రామాల్లో వివాహాది శుభకార్యాలకు డీజే సౌండ్ పెట్టవద్దని హెచ్చరించినా పెడుతున్న పలువురు డీజే యజమానులను మంగళవారం తహసీల్దార్ రవికాంత్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. మైలారం వెంకటేశం, వెలిశాల రవి(ధర్మారం), నేదునూరి మల్లేశం(నిమ్మపల్లి), వంగపెల్లి వంశీ(నిజామాబాద్), ఎనగంటి మహేశ్, జిన్న రమేశ్ (పల్లిమక్త), కుడుకల మహిపాల్(సుద్దాల), పిట్టల వంశీ, మారుపాక చంద్రయ్య (కనగర్తి), కీసరి రాజు(నాగారం), చింతల పర్శరాం(కోనరావుపేట)లను బైండోవర్ చేశామన్నారు.

ధాన్యం ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): మండలంలోని చిన్నబొంకూర్‌లో మంగళవారం ఊర చెరువు కట్ట ఎక్కుతున్న క్రమంలో ధాన్యం లోడ్ ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడగా డ్రైవర్ వరికిల్ల సతీశ్(37) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మచ్చ శ్రీనివాస్ వరి పంట కోసి ధాన్యంను ట్రాక్టర్‌లో తరలిస్తున్న క్రమంలో చెరువు కట్టపైకి ఎక్కిస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం బోల్తాపడింది. డ్రైవర్ సతీశ్‌పై ట్రాక్టర్ పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సమయంలో ట్రాక్టర్‌పై అర్నకొంట తిరుమలేశ్, మచ్చ ఆదర్శ్ ఉండగా తిరుమలేశ్‌కు గాయాలు కావడంతో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ విజేందర్‌తో పాటు ఎస్‌ఐలు అశోక్‌రెడ్డి, వినీత చేరుకొని వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారీ యంత్రాలపై రక్షణ చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని(రామగుండం): భారీ యంత్రాలపై ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలని మెకానికల్ డీఎంఎస్ సుధీర్‌గణపతిరావు సూచించారు. మంగళవారం భారీ యంత్రాల నిర్వహణ, ప్రమాదాల నివారణపై ఒక్కరోజు వర్క్‌షాప్ స్థానిక ఇల్లెందు క్లబ్‌లో జరిగింది. ఈసందర్భంగా డైరెక్టర్ మైన్‌సేఫ్టీ మాట్లాడుతూ, సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో నడిచే భారీ యంత్రాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. రక్షణ చర్యల విషయంలో రాజీ పడవద్దని, ప్రమాదాలు జరగకముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డైరెక్టర్లు ఎస్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, రక్షణ గురించి సింగరేణి తీసుకుంటున్న చర్యలు, ప్రమాదాలు అరికట్టేందుకు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి వివరించారు. వర్క్‌షాప్‌లో డీఎంఎస్‌లు నోముల సంజీవ్‌కుమార్, దిలీప్‌కుమార్, జీఎంలు సీహెచ్.నర్సింహారావు, గురువయ్య, చింతల శ్రీనివాస్, మనోహర్, టీవీ రావు, బళ్లారి శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్.సాంబయ్య, ఏరియా ఇంజినీర్లు తదితరులున్నారు.